సాక్షి అనకాపల్లి

మంగళవారం । 7 । నవంబర్ । 2023



విజయం మీ వెంటే..

మంత్రి అమర్‌నాథ్ అవంతి ఇంజినీరింగ్ కాలేజీ మీట్‌లో పాల్గొన్నారు. పట్టుదలతో చదివితే విజయం సాధ్యమన్నారు. IIలో



అర్జీలకు సమాధానం

కలెక్టరేట్ స్పందనకు 404 అర్జీలు వచ్చాయి. వినతులకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. IIలో



వైభవంగా నిత్య కల్యాణం

సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి నిత్యకల్యాణం సోమవారం విశేషంగా జరిగింది.

న్యూస్‌రీల్

నేడు రైతు భరోసా నగదు జమ

తుమ్మపాల: వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ పథకం ఐదో ఏడాది రెండో విడత నగదు పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం శ్రీ సత్య సాయి జిల్లాలో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తున్న సందర్భంగా జిల్లాలో 2,65,778 మంది రైతు కుటుంబాలకు నగదు జమ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూయజమానులు, కౌలు రైతులు, ఆర్వోఎఫ్ ఆర్, ఎండోమెంట్ రైతులకు రూ. 109.77 కోట్లు విడుదల కానుందన్నారు. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో నిర్వహించే జిల్లా స్థాయి కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ బీవీ సత్యవతి, రైతులు హాజరవుతారన్నారు. ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారాన్ని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో రైతులు వీక్షించుటకు ఏర్పాట్లు చేశామన్నారు.

బిహార్ గవర్నర్‌కు సాదర స్వాగతం



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న రాజేంద్ర విశ్వనాథ్

గోపాలపట్నం: బిహార్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌కు సోమవారం విశాఖ విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. ఆయనకు ఉన్నతాధికారులు, పోలీసులు స్వాగతం పలికారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం విశాఖ వచ్చారు. ఐసీఐడీ సదస్సులో పాల్గొనున్నారు.

'అమ్మ హెల్పింగ్ హార్ట్స్'కు సేవా పురస్కారం



అవార్డును అందుకుంటున్న అమ్మ హెల్పింగ్ హార్ట్స్ ప్రతినిధులు

బుచ్చెయ్యపేట: వడ్డాది మేజర్ పంచాయతీలోని అమ్మ హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సేవా సంస్థను రెడ్ డ్రాప్ ప్రాణదాత సేవా పురస్కారం వరించింది. అనంతపురం జిల్లా గుంతకల్లులో ఈ నెల 5న అమ్మ హెల్పింగ్ హార్ట్స్‌కు ఈ సేవా అవార్డు అందించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో విశిష్ట సేవలందించిన స్వచ్ఛంద సేవా సంస్థలపై అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన రెడ్ డ్రాప్ సంస్థ సర్వే నిర్వహించింది. వడ్డాదికి చెందిన అమ్మ హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ గత 13 ఏళ్లుగా రక్తదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేసి ఆపదలో ఉన్న వేలాదిమంది ప్రాణాలను కాపాడింది. ఈ ఏడాది అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి రోజున ఈ సంస్థ వడ్డాదిలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో ఒకే రోజు 567 మంది రక్తదానం చేశారు. ఈ సేవలను గుర్తించి రెడ్ డ్రాప్ ప్రాణదాత సేవా పురస్కారానికి ఎంపిక చేశారు. ఆదివారం గుంతకల్లులో జరిగిన వేడుకల్లో తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సంస్థ సభ్యులు తెలిపారు.

జాతీయ యోగా పోటీల్లో ఉపాధ్యాయిని ప్రతిభ



ఉపాధ్యాయిని విజయనిర్మలను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: జాతీయ యోగా పోటీల్లో పతకం సాధించిన ప్రభుత్వ ఉపాధ్యాయిని పి.విజయ నిర్మలను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి సన్మానించారు. ఒడిశా రాష్ట్రం రూర్కెలా జిల్లాలో ప్రోగ్రెసివ్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన 2023 నేషనల్ యోగాసన చాంపియన్‌షిప్ పోటీల్లో పాయకరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ విజయనిర్మల పాల్గొన్నారు. ఉమెన్ కేటగిరీలో ఆమె జాతీయస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఎమ్మెల్యే గణేష్ విజయనిర్మలను అభినందించారు. అంతర్జాతీయస్థాయిలో రాణించి నర్సీపట్నానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

ఎయిర్‌పోర్టుకు కొత్త రూపు



కార్ పార్కింగ్ వరకు విస్తరించనున్న కనోపి ఇదే..



అరైవల్, డిపార్చర్ రోడ్ల నిర్మాణం ఇక్కడ నుంచే..

- విమానాశ్రయ ప్రాంగణంలో మార్పులు
- వచ్చేవారికి, వెళ్లేవారికి వేర్వేరు మార్గాలు
- ప్రస్తుత మూడు లైన్లు ఏడు లైన్లకు విస్తరణ
- ఇందుకోసం రూ.20 కోట్ల వ్యయం
- వచ్చే నెలలో టెండర్లు, ఫిబ్రవరిలో పనులు మొదలు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం కొత్త రూపును సంతరించుకోనుంది. ఈ ప్రాంగణం మరిన్ని సొబగులతో ఎంతో సుందరంగా మారనుంది. ప్రయాణికులు సులభంగా రాకపోకలు సాగించేందుకు వీలుగా మార్పులు, చేర్పులతో పాటు రోడ్ల విస్తరణకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం జాతీయ రహదారి నుంచి ఎయిర్‌పోర్టులోకి ప్రవేశించిన వాహనాలు ప్రయాణికులను దించడం, ఎక్కించుకోవడం జరుగుతోంది. అనంతరం అక్కడ నుంచి అదే మార్గంలో ముందుకు వెళ్లి కుడి వైపు తిరిగి హైవేపైకి వెళ్తున్నాయి. ఇకపై అలా కాకుండా అరైవల్, డిపార్చర్ ప్రయాణికుల వాహనాలు వేర్వేరుగా వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. విమానాల్లో వెళ్లేందుకు వచ్చిన ప్రయాణికుల వాహనాలు, ఇతర వాహనాలు అరైవల్ పాయింట్ ఎదురుగా నేరుగా వెళ్లిపోయేలా రోడ్డును నిర్మిస్తారు. అలాగే విమానాల్లో వచ్చిన ప్రయాణికులు డిపాచర్ పాయింట్ ఎదురు నుంచే వెళ్లేలా మరో రోడ్డును నిర్మించనున్నారు. దీంతో విమాన ప్రయాణికుల వాహనాలు మునుపటిలా చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉండదన్న మాట! ఇలా అరైవల్‌కు ఒకటి, డిపాచర్ ప్రయాణికులకు మరొకటి విడివిడిగా ప్రత్యేక రోడ్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ రోడ్లను జాతీయ రహదారికి అనుసంధానం చేస్తారు.

మూడు లైన్లు ఇక ఏడు

విశాఖపట్నం విమానాశ్రయానికి రానురాను ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. కోవిడ్‌కు ముందు ఏటా 2.85 మిలియన్ల మంది ఈ ఎయిర్‌పోర్టు నుంచి రాకపోకలు సాగించేవారు. కోవిడ్ ప్రభావంతో ఆ తర్వాత విమాన సర్వీసులతో పాటు ప్రయాణికుల సంఖ్య కూడా క్షీణించింది. మళ్లీ ఈ ఏడాది నుంచి కోవిడ్‌కు ముందు పరిస్థితికి చేరుకుంటోంది. ఫలితంగా ప్రయాణికుల రద్దీ ఊపందుకుంది. ప్రస్తుతం ఈ విమానాశ్రయం ప్రాంగణంలో మూడు రోడ్లు ఉన్నాయి. ముమ్ముందు ప్రయాణికుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని ఇకపై వీటిని ఏడు రోడ్లుగా విస్తరించనున్నారు. దీని వల్ల ఎయిర్‌పోర్టులోకి వాహనాలు సులభంగా రాకపోకలు సాగించేందుకు వీలు కలుగుతుంది. పైగా ట్రాఫిక్ సమస్య తలెత్తదు.

కనోపీల విస్తరణ కూడా..

మరోవైపు ఎయిర్‌పోర్టుకు ఆనుకుని ఎదురుగా అటూ, ఇటూ కనోపీలున్నాయి. వీటిలో ఇప్పుడు కార్ పార్కింగ్ వైపు ఉన్న కనోపీని చివరి వరకు విస్తరించనున్నారు. దీనివల్ల ఫుట్‌పాత్ నుంచి ఎయిర్‌పోర్టు బిల్డింగులోకి వెళ్లే ప్రయాణికులు వర్షాలకు తడిసిపోయే వీలుండదు. వీటితో పాటు ఈ విమానాశ్రయంలో సైనేజి బోర్డులు కూడా ఏర్పాటు చేస్తారు. వీటన్నిటికి రూ.20 కోట్లు వెచ్చించనున్నారు. ఇలా రోడ్లు, కనోపీల విస్తరణ, సైనేజీ బోర్డుల ఏర్పాటు వంటి వాటితో విశాఖ విమానాశ్రయం మరింత శోభాయమానంగా మారనుంది.

డిసెంబరులో టెండర్లు



విశాఖ విమానాశ్రయానికి ప్రయాణికుల తాకిడి పెరుగుతున్న దృష్ట్యా వారికి మరిన్ని సౌకర్యాలు పెంచేలా చూస్తున్నాం. ఇందుకనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ఈ ఎయిర్‌పోర్టులో రూ.20 కోట్లతో చేపట్టబోయే పనులకు ప్రణాళిక సిద్ధమైంది. డిసెంబరులో టెండర్లను పిలుస్తారు. టెండర్లు ఖరారయ్యాక ఫిబ్రవరిలో పనులు మొదలు పెడతాం. ఆ తర్వాత తొమ్మిది నెలల్లో పూర్తి చేస్తాం.

– ఎస్.రాజారెడ్డి, డైరెక్టర్, విశాఖ విమానాశ్రయం

ప్రయాణికుల కోసం స్పెషల్ రైళ్లు



తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్ – కటక్ – హైదరాబాద్ (వయా దువ్వాడ మీదుగా) మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

- హైదరాబాద్ – కటక్ (07165) స్పెషల్ హైదరాబాద్‌లో ఈ నెల 7, 14, 21న (ప్రతీ మంగళవారం) రాత్రి 8.10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 9.07 గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 5.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కటక్ – హైదరాబాద్ (07166) స్పెషల్ కటక్‌లో ఈ నెల 8, 15, 22న (ప్రతీ బుధవారం) రాత్రి 10.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.35 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 7.37 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 9 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.
- ప్రయాణికుల సౌకర్యార్థం పూర్తి జనరల్ కోచ్‌లతో కూడిన ఎర్నాకుళం ధన్‌బాద్ (06077) స్పెషల్ రైలు ఈ నెల 10న రాత్రి 11.55 గంటలకు ఎర్నాకుళంలో బయల్దేరి ఆదివారం తెల్లవారుజామున 1.45 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 1.50 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 11 గంటలకు ధన్‌బాద్ చేరుకుంటుంది. ఈ రైలు 22 జనరల్, 2 లగేజీ కం సెకండ్ క్లాస్ కోచ్‌లతో నడుస్తుంది.
- ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బెంగళూరు – న్యూ భువనేశ్వర్ – బెంగళూరు మధ్య జన సాధారణ్ స్పెషల్ రైలు నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు.
- బెంగళూర్ – న్యూ భువనేశ్వర్ (06287) స్పెషల్ ఈ నెల 10న బెంగళూరులో తెల్లవారుజామున 4 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 10.38 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 10.40 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6.30 గంటలకు న్యూ భువనేశ్వర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో న్యూ భువనేశ్వర్ – బెంగళూరు (06288) స్పెషల్ శనివారం ఉదయం 8.15 గంటలకు న్యూ భువనేశ్వర్‌లో బయల్దేరి అదేరోజు సాయంత్రం 4.15 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 4.17 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 10 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది.

మళ్లీ వచ్చేది జగన్ ప్రభుత్వమే

వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి కేక్ తినిపిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు తదితరులు

కొమ్మాది (విశాఖ): నాటి సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. 2024లో కూడా తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే వస్తుందని స్పష్టం చేశారు. ప్రజా సంకల్ప యాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం వైవీ సుబ్బారెడ్డి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో వివిధ వర్గాల నుంచి వినతులు స్వీకరించి వాటిని మేనిఫెస్టోలో చేర్చి నవరత్నాలకు జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన వెంటనే నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టి దిగ్విజయంగా కొనసాగిస్తున్నారని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మహిళా విభాగం అధ్యక్షురాలు కృపాజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, రవీంద్ర బాబు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, పసుపులేటి బాలరాజు, పార్టీ అనకాపల్లి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు పిల్లా సుజాత, పేర్ల విజయ్ చందర్, అనూషా పట్నాయక్, సుజాత, పేడాడ రమణకుమారి, మాధవి, కొల్లి సింహాచలం, కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

9న తేగాడలో పలు ప్రారంభోత్సవాలు

కశింకోట: మండలంలోని తేగాడ గ్రామంలో ఈ నెల 9న పలు ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. అనకాపల్లిలో చేపట్టే సామాజిక సాధికార బస్సు యాత్ర సభకు ముందు ఆ రోజు ఉదయం 9 గంటలకు వీటిని మంత్రులు ప్రారంభించనున్నారు. ఈ బస్సు యాత్రలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, విశాఖ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి అమర్‌నాథ్ సూచనల మేరకు ఇక్కడ ప్రధానంగా ఐదు గ్రామాలను కలిపి ఒకచోట నిర్మిస్తున్న వైఎస్సార్ జగనన్న మెగా కాలనీ, ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో రూ.65 లక్షలతో చేపట్టనున్న నాడు–నేడు పనులు, సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్రం భవనాలను ప్రారంభించడానికి స్థానిక నాయకులు, అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతోపాటు పైలాన్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. ఎంపీడీవో వి.వి.రవికుమార్, హౌసింగ్ ఏఈ వి.శ్రీనివాసరావు వైఎస్సార్ సీపీ సచివాలయ మండల కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిశోర్, తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

కేజీహెచ్‌లో కార్పొరేట్ వైద్య సేవలు

రూ.5.16 కోట్లతో ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చిన హెచ్‌పీసీఎల్



సీఎస్ఆర్ బ్లాక్‌లో వైద్య పరికరాల యూనిట్ ప్రారంభిస్తున్న హెచ్‌పీసీఎల్ ఈడీ రత్నరాజ్

మహారాణిపేట (విశాఖ): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన నాడు – నేడు పథకం, ప్రైవేటు కంపెనీల సీఎస్ఆర్ నిధుల సహకారంతో కేజీహెచ్‌లో ఎన్నో రకాల అభివృద్ధి పనులు చేశామని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. ఆధునిక వైద్య పరికరాలు, వసతులు సమకూర్చడంతో కార్పొరేట్‌కు దీటుగా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. రూ.5.16 కోట్ల సీఎస్ఆర్ నిధులతో హెచ్‌పీసీఎల్ సమకూర్చిన ఆధునిక వైద్య పరికరాలను, ఆక్సిజన్ యంత్రాలను, స్ట్రెచర్లను ఆ సంస్థ ఈడీ వి.రత్నరాజ్, సీజీఎం కిరణ్ కుమార్, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఇతర వైద్యాధికారులతో కలిసి స్థానిక సీఎస్ఆర్ బ్లాక్‌లో ప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చారు. అనంతరం ఒక్కో పరికరం వద్దకు వెళ్లి పనితీరు, ప్రయోజనాలను నిపుణులు, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించేందుకు అనుగుణంగా హెచ్‌పీసీఎల్ ముందుకొచ్చి సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఆధునిక వసతులతో కూడిన తొమ్మిది అంబులెన్సులను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వీటన్నింటి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని, ప్రజలు తప్పకుండా సంతోషం వ్యక్తం చేస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

మా భాగస్వామ్యం సంతోషకరం

పేద ప్రజలకు వైద్య పరమైన సేవలందించే కార్యక్రమంలో భాగస్వాములం కావడం సంతోషకరమని, ఇలాంటి బృహత్తర కార్యక్రమం కార్యరూపం దాల్చడానికి కలెక్టర్ మల్లికార్జున చూపిన చొరవ, చేసిన కృషి అభినందనీయమని హెచ్‌పీసీఎల్ ఈడీ వి.రత్నరాజ్ పేర్కొన్నారు. సీఎస్ఆర్ కింద విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. ఇదే చొరవతో భవిష్యత్‌లో మరిన్ని సేవలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీవో శ్రీనివాసరావు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ నాయుడు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ రజిని, ఆంధ్రా మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ మన్మథరావు, డాక్టర్ రాజేంద్రప్రసాద్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్‌వోడీ డాక్టర్ గిరినాథ్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

జనవాక

జనం.. ప్రభంజనం.. కెరటం ఎగిసిపడ్డట్టు... నేల ఈనిందా అన్నట్టు జనమే జనం. సామాజిక సాధికార యాత్ర బహిరంగ సభతో పాత గాజువాక కాస్తా జనవాకగా మారిపోయింది. సభాస్థలి జనంతో నిండిపోయింది. నేతల స్వరం జనం గొంతుకైంది. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తుంటే జనం జై జగన్ అంటూ నినదించారు. విశ్వసనీయత పెంచేలా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని మంత్రులు వ్యాఖ్యానించారు. అడుగడుగునా ఆత్మీయంగా చప్పట్లతో సభాస్థలి మార్మోగింది.



పాత గాజువాక జంక్షన్‌లో జరిగిన సామాజిక సాధికార సభకు హాజరైన జన సందోహం



పార్టీ జెండాలతో బైక్ ర్యాలీ

- గాజువాకలో సామాజిక సాధికార యాత్రకు తరలొచ్చిన జనం
- యాత్ర విజయవంతంతో వైఎస్సార్‌సీపీ కేడర్‌లో ఉత్సాహం



జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

గాజువాక: పాతగాజువాక జంక్షన్ జనసంద్రంగా మారింది. సామాజిక సాధికార యాత్రలో భాగంగా సోమవారం సాయంత్రం నిర్వహించిన బహిరంగ సభకు జనం భారీగా తరలివచ్చారు. దీంతో 60 అడుగుల రోడ్డు కనుచూపు మేరలో ఇసుకేస్తే రాలనంతగా జనంతో నిండిపోయింది. సభలో మంత్రులు, ప్రజాప్రతినిధుల ప్రసంగాలకు జనం నీరాజనం పట్టారు. ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు రావాలన్న విషయాన్ని వివరిస్తూ వారు చేసిన ప్రసంగాలు ఆలోచింపజేశాయి. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తన ప్రసంగంలో అనేక సమస్యలను స్పృశించడంతోపాటు వాటి పరిష్కారానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషిని వివరించారు. అవే సమస్యలను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వెనక్కి నెట్టేసిన వైనాన్ని స్పష్టం చేస్తూ ప్రసంగించారు. ఇన్నాళ్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు జరిగిన అన్యాయం, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరుగుతున్న న్యాయాన్ని వివరిస్తూ ఆయా వర్గాలు అండగా నిలవాలని కోరారు. రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల జీవన స్థితిగతులు మెరుగైన అంశాలను సోదాహరణంగా వివరించారు. అభివృద్ధిని ఎలా చూడాలి, జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధితో రాష్ట్రం ఏ విధంగా ముందుకు సాగుతోంది వంటి విషయాలను వివరించారు. సభలో ఎంపీ నందిగాం సురేష్, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ బాష తదితరుల ప్రసంగాలకు జనం నుంచి మంచి స్పందన లభించింది. వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, వంగపండు ఉషారాణి ఆధ్వర్యంలో జానపద కళాకారులు పాటలు, నృత్యాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్‌కుమార్, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్‌రావు, కార్పొరేషన్ చైర్మన్లు పేర్ల విజయచందర్, పిల్లా సుజాత, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ తదితరులు పాల్గొన్నారు.

కార్డు 2.0 ద్వారా ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు



మధురవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లను పరిశీలిస్తున్న స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ

దొండపర్తి: రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ప్రవేశపెట్టిన నూతన విధానం తొలి రోజు సక్సెస్ అయింది. కార్డు 2.0 ద్వారా చేపట్టిన రిజిస్ట్రేషన్లు సూపర్ ఫాస్ట్‌గా పూర్తయ్యాయి. ఎటువంటి ఇబ్బంది లేకుండా కేవలం 30 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుండడంతో క్రయ విక్రయదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సులభతరం చేసి వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా నూతన రిజిస్ట్రేషన్ విధానాన్ని సోమవారం నుంచి జిల్లాలో అమలు చేసింది. క్రయ విక్రయదారులు డాక్యుమెంట్ తయారు చేసుకోవడం నుంచి స్టాంప్ డ్యూటీ చెల్లింపుల వరకు అన్నీ ఆన్‌లైన్‌లోనే అందుబాటులోకి వచ్చాయి. ప్రధానంగా ఆన్‌లైన్‌లోనే టైం స్లాట్ ద్వారా నిర్దిష్ట తేదీ, సమయం తెలుస్తుండడంతో నిర్ణీత సమయానికి సంబంధిత రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే కేవలం 30 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగుస్తోంది. కార్డు 2.0 ద్వారా జరుగుతున్న రిజిస్ట్రేషన్ల తీరును స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ జి.బాలకృష్ణ పరిశీలించారు. మధురవాడ, ద్వారకానగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి అక్కడ జరుగుతున్న రిజిస్ట్రేషన్లపై ఆరా తీశారు. నూతన విధానంలో జరిగిన రిజిస్ట్రేషన్లలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదని డీఐజీ బాలకృష్ణ తెలిపారు. దీనిపై ప్రజల్లో అవగాహన పెరిగితే ప్రతి ఒక్కరికీ సులభతరమైన సేవలందుతాయన్నారు.

క్లుప్తంగా

అర్ధరాత్రి బైక్ దగ్ధం

పోలీసులకు ఫిర్యాదు



పూర్తిగా దగ్ధమైన బైక్

రావికమతం: గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ద్విచక్ర వాహనం ఆదివారం అర్ధరాత్రి దగ్ధమైంది. రావికమతం గ్రామానికి చెందిన కొశిరెడ్డి శ్రీను బైక్‌ను ఎప్పటి మాదిరిగా ఇంటి ముందు పార్క్ చేసి ఉంచాడు. అర్ధరాత్రి సమయంలో కాలిపోతూ శబ్దం రావడంతో బయటికి వచ్చి చూశాడు. వెంటనే మంటలార్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని వాపోయాడు. తనపై గిట్టని వారు ఈ దారుణానికి పాల్పడ్డారని సోమవారం రావికమతం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం

మర్రిపాలెం (విశాఖ): ఓ వివాహిత ఇద్దరు పిల్లలను తీసుకుని అదృశ్యమైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. చోడవరంలో భర్త ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్న కాండ్రేగుల కుసుమ(28) భర్తతో గొడవపడి ఈ నెల 4న కంచరపాలెం తిక్కవానిపాలెంలో ఉంటున్న తన తల్లి దగ్గరికి కుమారుడు యెల్లాపు కుషంత్‌కుమార్(5), కుమార్తె యెల్లాపు లాస్య (2)ను తీసుకుని వచ్చింది. 5వ తేదీ ఆదివారం ఉదయం కంచరపాలెం మెట్టు దగ్గర తన భర్త ఉన్నాడని, అతడితో కలిసి ఊరు వెళ్తున్నానని చెప్పి ఇద్దరు పిల్లలని తీసుకుని వెళ్లింది. భర్త తన దగ్గరకు రాలేదనడంతో తల్లి కాండ్రేగుల ఆదిలక్ష్మి సోమవారం కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఎస్‌ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

'నివాస ప్రాంతాల సర్వేకు సహకరించండి'

తుమ్మపాల: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న నివాస ప్రాంతాల సర్వే (స్వామిత్వ)కు ప్రజలు సహకరించాలని జిల్లా ఇన్‌చార్జి పంచాయతీ అధికారి మూర్తి సోమవారం ఓ ప్రకటనలో కోరారు. పంచాయతీల పరిధిలో సర్వే చేసే సమయంలో యజమానులు అందుబాటులో ఉండాలన్నారు. తమ ఆస్తి ధ్రువీకరణ పత్రాల నకళ్లు సర్వే బృందానికి అందించి, సహకరించాల్సిందిగా కోరారు.

స్పందన అర్జీలకు స్పష్టమైన సమాధానం

- అధికారులకు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశం
- కలెక్టరేట్‌లో స్పందనకు 404 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

తుమ్మపాల: జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో వచ్చే అర్జీలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులకు వేగంగా సమాధానాలు ఇవ్వాలన్నారు. ఫిర్యాదులు నమోదైన తేదీ నుంచి నిర్ణీత గడువులోగా సమస్యలను విచారించి పరిష్కరించినట్‌లైతే ప్రజలు సంతృప్తి చెందుతారని, ఫిర్యాదుల సంఖ్య తగ్గుతుందన్నారు. గ్రామ, మండల స్థాయి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఫిర్యాదులుంటే తక్షణమే స్పందించి, చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిపై అర్జీలను వేగంగా విచారించి, అర్హులైన వారికి వర్తింపజేయాలన్నారు. మండల స్థాయిల్లో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్పందనపై నమ్మకంతోనే అధిక సంఖ్యలో అర్జీలు నమోదవుతున్నాయని, సమస్యల పరిష్కారంలో ప్రజల సంతృప్తి స్థాయి శతశాతం ఉండాలన్నారను. స్పందన వేదిక నుంచి జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్, ఎస్డీసీ ఎ.మహేష్, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి అర్జీలు, వినతులు స్వీకరించారు. మొత్తం 404 అర్జీలు నమోదయ్యాయి. గత రెండు వారాలుగా జిల్లా నలుమూలల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో రావడంతో అర్జీల సంఖ్య ఎక్కువగా ఉంది. దీంతో సచివాలయ సిబ్బందిచే అదనపు కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు స్పందన ఇన్‌చార్జి సత్యనారాయణ తెలిపారు. మొత్తం 12 స్టాళ్లను ఏర్పాటు చేయడంతో అర్జీల నమోదు ప్రక్రియ వేగంగా జరిగిందన్నారు.

జీతాలు మంజూరు చేయించండి

పరవాడ ఫార్మాసిటీలో సీనియర్ లైఫ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులకు సకాలంలో జీతాలు, ఇతర భత్యాలు చెల్లించడం లేదని, తక్షణమే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పలువురు ఉద్యోగులు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. నెలల తరబడి జీతాలతో పాటు, పీఎఫ్ కూడా చెల్లించకుండా పనిచేయిస్తూ యాజమాన్యం తమకు తీవ్ర అన్యాయం చేసిందని దూడ బంగారాజు, ఎం.నాయుడు, ఎం.శ్రీనివాసు, కె.మహేశ్వరరావు తదితరులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

సాగు భూమికి సరిహద్దులు తేల్చండి

పరవాడ మండలం చీపురుపల్లి గ్రామంలో సర్వే నెం.87–7లో తమకున్న 40 సెంట్ల వ్యవసాయ భూమిని గ్రామానికి చెందిన ఇతరులు అక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని నాయుడుపాలెం గ్రామానికి చెందిన కోరంగి అప్పారావు, గురువులు, శంకరరావు, ఉప్మాకలు, ముత్యాలు స్పందనలో ఫిర్యాదు చేశారు. తమపై దౌర్జన్యం చేస్తూ తమ భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తమ తల్లి కోరంగి నెల్లూరమ్మ పేరున ఖాతా నెం.534 పట్టాదారు పాసుపుస్తకాలు కూడా ఉన్నాయన్నారు. అయినా సరే సరిహద్దులో ఉన్న ఇతరులు తమ భూమిని అక్రమిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్పీ స్పందనకు 30 అర్జీలు

అనకాపల్లిటౌన్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందనకు 30 అర్జీలు వచ్చినట్లు ఎస్పీ కేవీ మురళీకృష్ణ చెప్పారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ వారి అర్జీలను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టపరిధిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కుటుంబ సమస్యలు, ఆస్తి తగాదాలు, ఇతరత్రా సమస్యలపై అర్జీలు అధికంగా వచ్చాయన్నారు. అర్జీదారుల సమస్యలపై వారి సమక్షంలోనే సంబంధిత అధికారులతో ఎస్పీ ఫోన్లో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అదనపు క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు, ఎస్‌ఐ బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.



అర్జీలపై అధికారులతో ఫోన్లో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

ప్రణాళికాయుత చదువుతో విజయం



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ విజయభాస్కర్

అనకాపల్లిటౌన్: సమాజంలో ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకెళ్లగలిగే శక్తి పుస్తకాలకు మాత్రమే ఉందని జిల్లా అడిషనల్ ఎస్పీ(పరిపాలన) బి.విజయభాస్కర్ అన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు, నెహ్రూ యువ సంఘటన్, కేంద్ర హోం మంత్రిత్వశాఖల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో సోమవారం జరిగిన గిరిజన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుస్తకాల పట్ల మర్యాదగా వ్యవహరించడం ద్వారా సంస్కృతిని, ఎంచుకున్న కెరీర్‌లో విజయం సాధించడానికి నైపుణ్యాలు, జ్ఞానం, అనుభవాన్ని పెంపొందించుకోవాలన్నారు. అవగాహనలేమి, అనిశ్చితితో కొంత మంది విద్యార్థులు తప్పుడు కెరీర్‌లను ఎంపిక చేసుకుటున్నారని పేర్కొన్నారు. జీవన నైపుణ్యాలు విద్యార్థుల శారీరక ఆరోగ్యం, మానసిక వికాసానికి దోహదపడతాయన్నారు. వివిధ ప్రభుత్వ ఉద్యోగాల పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఏం చదవాలి? ఎలా చదవాలి? భయాన్ని ఎలా తొలగించుకోవాలి.. అనే అంశాలపై దృష్టి సారించాలన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశాఖ ఉమ్మడి జిల్లా నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి జి.మహేశ్వరరావు, యలమంచిలి ఎంఈవో వై.మీనాక్షి, యువ కేంద్రం రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ, గౌరీ గ్రంథాలయం అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిన భీమవరంలో దేవస్థానం భూముల పరిశీలన

బుచ్చెయ్యపేట: మండలంలోని చిన భీమవరంలో దేవస్థానానికి కేటాయించిన భూములను ఎస్‌ఐ కుమారస్వామి తన సిబ్బందితో కలిసి సోమవారం పరిశీలించారు. గ్రామదేవత పడమటమ్మ, రామాలయానికి కేటాయించిన భూములను గ్రామ టీడీపీ నాయకుడు, అనకాపల్లికి చెందిన వ్యాపారి ఆక్రమించి డీఫారం పట్టాలు చేయించుకోవడంపై ఆదివారం ఇక్కడ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ భూముల్లో వేసిన ఫెన్సింగ్‌ను, మొక్కలను తొలగించారు. అధికారులు ఈ భూములను కాపాడాలని ధర్నా చేపట్టారు. దీనిపై ఇరువర్గాల వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో వివాదాస్పద భూములను ఎస్‌ఐ పరిశీలించారు. ఇరువర్గాలకు చెందిన భూ రికార్డులను తీసుకు రావాలని, గొడవలకు దిగకుండా గ్రామ పెద్దలు, రెవెన్యూ అధికారుల సమక్షంలో సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

బీఎన్ రోడ్డు పనుల్లో నాణ్యత పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ రమేష్‌కుమార్

చోడవరం: బీఎన్ రోడ్డు పనుల్లో నాణ్యతను ఆర్ అండ్‌బీ అధికారులు సోమవారం పరీక్షించారు. చోడవరం మండలం గంధవరం నుంచి రోలుగుంట వరకూ బీఎన్‌రోడ్డు పనులకు ప్రభుత్వం గతేడాది రూ. 112 కోట్లు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో చాలా ఆలస్యంగా ఈ పనులు ప్రారంభమయ్యాయి. నిబంధన ప్రకారం ప్రతీ గ్రామం ప్రారంభం, చివర భాగాల్లో 100 నుంచి 200 మీటర్ల దూరం వరకూ సీసీరోడ్డు పనులు చేపట్టారు. ఈ పనుల్లో నాణ్యతను పరిశీలించడానికి ఆర్‌అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో డీఈఈ సత్యకుమార్, అనకాపల్లి డీఈఈ ధనుంజయ్‌తో కూడిన బృందం సోమవారం పర్యటించింది. వెంకన్నపాలెం నుంచి చోడవరం వరకు సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. నాణ్యత పరీక్షల్లో భాగంగా ప్రతీ 40 అడుగులకు ఒక ప్రదేశంలో రోడ్డును తవ్వి శాంపిల్స్ సేకరించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజినీర్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ పూర్తిస్థాయి నాణ్యతతో రోడ్డును వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సేకరించిన శ్యాంపిల్స్‌ను పరీక్షించి, నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదన్నారు. పూర్తిగా నాణ్యతతో కూడిన రోడ్డు పనులు చేసేందుకు ఎప్పటికప్పుడు పనులను పరిశీలిస్తామన్నారు.

సీఎం చిత్రపటానికి జర్నలిస్టుల క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు, చిత్రంలో విప్ ధర్మశ్రీ

చోడవరం: వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు చోడవరం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కార్యాలయం వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం జర్నలిస్టులంతా కలిసి క్షీరాభిషేకం చేశారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులంతా పాల్గొని థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని ఘనంగా సత్కరించారు. ఏళ్ల నాటి జర్నలిస్టుల కల ఫలించిందని, ఆ దిశగా చర్యలు చేపట్టిన సీఎం జగన్‌కు జర్నలిస్టు కుటుంబాలన్నీ రుణపడి ఉంటాయని యూనియన్ ప్రతినిధులు కొనియాడారు. ధర్మశ్రీ మాట్లాడుతూ జర్నలిస్టులకు 3 సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి, వారిని సొంతింటి వారిని చేయాలని ముఖ్యమంత్రి ఎంతో మంచి ఆశయంతో ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చొక్కాకుల వెంకట్రావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు డీవీఎం నాయుడు, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు కొప్పాక భాస్కరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కోవెల శ్రీనివాసరావు, ఎలక్ట్రానిక్ మీడియా విభాగం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు జగదీష్, సీజేఎఫ్ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బస్సు యాత్ర ప్రమాద బాధితులకు రూ.3 లక్షల పరిహారం

రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ప్రకటన

మాడుగుల: ఈ నెల 2న మండలంలోని ఘాట్‌రోడ్ జంక్షన్‌లో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర సభకు వచ్చి, తిరుగు ప్రయాణంలో జరిగిన వాహన ప్రమాదంలో గాయపడ్డ బాధితులకు చెరో రూ.లక్ష చొప్పున పరిహారం అందించనున్నట్లు వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి సోమవారం ప్రకటించారు. చిన్న పొరపాటు వల్ల ఆ రోజు జరిగిన ప్రమాదంలో అవురువాడ పంచాయతీ పెద్దగొర్రిగెడ్డ గ్రామానికి చెందిన గిరి మహిళలు కొప్పల దేముడమ్మ, కిలంబోయిన రాజులమ్మ, బిడిజాన లక్ష్మిల చేతులకు గాయాలయ్యాయి. వెంటనే వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఎంపీపీ వేమవరపు రామధర్మజల ఆధ్వర్యంలో హుటాహుటిన విశాఖకు పంపించి, అత్యవసర వైద్యం అందించేందుకు కృషి చేశారు. దీంతోపాటు పార్టీ పరంగా బాధిత కుటుంబాలకు చేయూతనివ్వాలనే ఆశయంతో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఈ విషయాన్ని సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన పార్టీ తరపున ముగ్గురికీ చెరో రూ.లక్ష చొప్పున రూ.3 లక్షలు అందించనున్నట్లు స్థానిక మీడియాకు తెలిపారు. ఆపదలో ఉన్నవారికి ఎల్లప్పుడూ తమ పార్టీ అండగా ఉంటుందన్నారు. బాధితులకు త్వరలోనే ఆర్థిక సాయం అందిస్తామన్నారు.

పట్టుదల ఉంటే.. విజయం మీ వెంటే

అవంతి ఇండక్షన్ మీట్‌లో మంత్రి అమర్‌నాథ్



విద్యార్థులకు జ్ఞాపికలు అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్



ఇండక్షన్ మీట్‌కు హాజరైన విద్యార్థులు

మాకవరపాలెం: పట్టుదలతోనే విజయాలను సొంతం చేసుకోవచ్చని రాష్ట్ర ఐటీ, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఇండక్షన్ మీట్‌లో అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం ఇదే కళాశాలలో ఇంజినీరింగ్ చదివి, ఇపుడు ఇదే కళాశాలకు ముఖ్యఅతిథిగా హాజరుకావడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల ఉన్నతికి అధ్యాపకులు కృషి చేస్తారని, వారు చెప్పిన విషయాలను పెడచెవిన పెట్టకుండా పాటించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం చైర్మన్, భీమిలి ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ కృషి, పట్టుదల, ప్రణాళికతో ముందుకు సాగితే విజయం సాధించవచ్చన్న స్వామి వివేకానంద మాటలను గుర్తు చేశారు. ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో కళాశాలను స్థాపించి విద్యను అందిస్తున్న శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ జీవితంలో కాలం చాలా విలువైనదన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఎస్ఎస్‌టీఎల్ సైంటిస్ట్ పీవీఎస్ గణేష్, విజయనగరం జేఎన్‌టీయూ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ బాబులు, పినాం పీవుల్స్ ఈడీ శ్రీనివాస్‌లు ఇంజినీరింగ్ విద్యలో రాణించేందుకు అవసరమైన మెలకువలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం క్రీడలు, ఇతర విభాగాల్లో రాణిస్తున్న విద్యార్థులకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శభాష్ వలంటీర్



గంగరాజుకు పింఛన్ అందిస్తున్న నాయుడుబాబు

రావికమతం: కవగుంట గ్రామ వలంటీర్ ప్రగడ నాయుడుబాబు సోమవారం రాజమండ్రి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న బర్నికాన గంగరాజుకు పింఛన్ అందించి తన నిబద్ధతను చాటుకున్నారు. తన పరిధిలో ఉన్న పింఛన్ లబ్ధిదారులందరికీ ఈ నెల ఆరంభంలోనే పింఛన్ నగదును అందించేశారు. అయితే ఆ గ్రామానికి చెందిన గంగరాజు అనారోగ్యంతో రాజమండ్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న నాయుడుబాబు అక్కడికే వెళ్లి పింఛన్ సొమ్ము అందించారు. అతని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, ధైర్యం చెప్పారు. వలంటీర్‌కు ఆ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

'సెల్'గాటంపై ఎంఈవో విచారణ



మొబైల్ ఫోన్ వివాదంపై విచారణ చేస్తున్న ఎంఈవో మీనాక్షి

యలమంచిలి (అనకాపల్లి రూరల్): యలమంచిలి మండలం ఏటికొప్పాక హైస్కూల్లో హెచ్ఎం కాండ్రేగుల సూర్యనారాయణ మొబైల్ ఫోన్‌ను ఉపాధ్యాయుడు వెంకటేష్ దాచి పెట్టడంతో ఏర్పడిన వివాదంపై ఎంఈవో వై.మీనాక్షి సోమవారం విచారణ చేపట్టారు. డీఈవో ఆదేశం మేరకు ఆమె ఇక్కడ హెచ్ఎంను, సైన్స్ అసిస్టెంట్‌ను వేర్వేరుగా విచారించారు. ఈ నెల జరగనున్న బాలల జాతీయ సైన్స్ కాంగ్రెస్‌కు విద్యార్థులను సంసిద్ధులను చేయాలని హెచ్ఎం చెప్పడంతో తాను టెన్షన్‌కు గురయ్యానని స్కూల్ అసిస్టెంట్ వాపోయాడు. దీంతో హెచ్ఎం మొబైల్ ఫోన్ దాచిపెట్టానని వివరించాడు. ఇకపై ఇలాంటివి చేయబోనని క్షమాపణ పత్రం రాసిచ్చాడు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశమై విధి నిర్వహణలో నిబంధనల ప్రకారం నడుచుకోవాలని ఎంఈవో సూచించారు. విద్యార్థుల ఎదుటే ఇలాంటి పంచాయితీలు సృష్టిస్తే గౌరవం కోల్పోతారని హితవు పలికారు. విచారణ నివేదికను డీఈవోకు పంపించనున్నట్టు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక పోటీలు



గిరిజన సంప్రదాయ నృత్య ప్రదర్శన

రాంబిల్లి: ఎంఎస్ఎంఈ కేంద్రంలో నాలుగు రాష్ట్రాల గిరిజన యువత శిక్షణ సోమవారం కొనసాగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా బీహార్, మహరాష్ట్ర, ఒడిశా, మహరాష్ట్ర రాష్ట్రాలకు చెందిన గిరిజన యువతీయువకులకు ఆయా రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలిచే నృత్య ప్రదర్శన పోటీలు నిర్వహించారు. గిరిజన యువత ఎంతో సంప్రదాయబద్ధంగా చేసిన నృత్య ప్రదర్శనలు ఆద్యంతం కట్టిపడేశాయి. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం(విశాఖపట్నం) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన యువ సమ్మేళనం కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన పోటీలు నిర్వహించామని, ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ఈ నెల 8న శిక్షణ ముగింపు సందర్భంగా బహుమతులు అందజేస్తామని జిల్లా యువ అధికారి జి. మహేశ్వరరావు తెలిపారు.


ఉత్సాహంగా 'రిమ్ జిమ్'



శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల రిమ్ జిమ్–2023లో పరుగు పోటీలో పాల్గొన్న బాలలు

పాయకరావుపేట: స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో రిమ్ జిమ్–2023 సోమవారం ఘనంగా ప్రారంభమైనది. కార్యక్రమం ఈ నెల 6 నుంచి 11 వరకు జరగనుంది. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలకు చెందిన తుని, పాయకరావుపేట, అన్నవరం శాఖల విద్యార్థులు సుమారు 4500 మంది పాల్గొననున్నారు. రిమ్ జిమ్ కార్యక్రమంలో సాహిత్యం, సంగీతం, ఆటలు, లలిత కళలు, థియేటర్ ఆర్ట్స్, సైన్స్ వంటి అనేక అంశాల మీద జూనియర్, సబ్ జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ విభాగాలలో 29 రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ప్రోగ్రాం కన్వీనర్, అకడమిక్ ఇన్‌చార్జిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న కారు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయితో ఉన్న కారు

మాడుగుల రూరల్: మండలంలో కోనాం అవతలి వైపు నుంచి అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న కారును కోనాం చెక్ పోస్టు సమీపంలో గుంటి కొత్తూరు వద్ద పోలీసులు పట్టుకున్నారు. సోమవారం ఉదయం గుడివాడ మీదుగా గంజాయిని కారులో తరలిస్తుండగా, కోనాం చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ గోవిందరావు కారు తనిఖీ చేసేందుకు నిలపాల్సిందిగా సిగ్నల్ ఇచ్చారు. అయితే కారు అతివేగంగా నడిపించి తప్పించుకోనేందుకు నిందితులు ప్రయత్నించారు. దీంతో హెడ్‌కానిస్టేబుల్, చెక్‌పోస్టు సిబ్బంది వెంటపడగా కారును గుంటి కొత్తూరు వంతెన వద్ద విడిచిపెట్టి, నిందితులు పరారయ్యారు. ఈ సమాచారాన్ని చీడికాడ ఎస్‌ఐకు నివేదించారు. ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని కారును సీజ్ చేసి, పోలీసు స్టేషన్‌కు తరలించారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

ఆటో నుంచి జారి పడి మహిళ మృతి

మాడుగుల: మాడుగుల మెయిన్‌రోడ్డులో ఫైర్ స్టేషన్ వద్ద ఆటో నుంచి జారిపడి సోమవారం ఓ మహిళ మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ పి.దామోదరనాయుడి తెలిపిన వివరాలు. మండలంలోని పొంగలిపాక గ్రామానికి చెందిన నాయన సర్వ(45) ఆటోలో మాడుగుల వస్తోంది. ఫైర్‌స్టేషన్ వద్దకు రాగానే ఎదుటి నుంచి వాహనాలను చూసి ఆటో డ్రైవర్ సడన్‌బ్రేక్ వేశాడు. దీంతో సర్వ ముందుకు పడిపోయింది. తలకు తీవ్రగాయాలయ్యాయి. కొన ఊపిరితో ఉన్న ఆమెను స్థానిక 30 పడకల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ తెలిపారు. పంచనామా నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, భర్త ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

కాస్త తగ్గిన ఉల్లి ధర

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం ఉల్లిపాయల ధర కాస్త తగ్గింది. గత వారం కిలో రూ.70 ఉండగా, ఈ వారం కిలో రూ.60కి తగ్గింది. కొత్త ఉల్లిపాయలు రూ.50కే విక్రయాలు సాగాయి. టమాటా రూ.40, బంగాళాదుంప, వంకాయ రూ.30, దొండకాయ రూ.20, బెండకాయ, బీట్రూట్, క్యారెట్, బీరకాయ, బరబాటి, కాకరకాయ రూ.60, క్యాప్సికం, పాదు చిక్కుడు రూ.100కు విక్రయాలు సాగాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లిటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా విద్యుత్ స్తంభాలను మార్చుతున్నట్లు విద్యుత్‌శాఖ ఆపరేషన్స్ ఈఈ కె.రాజశేఖర్, డీ–1 సెక్షన్ ఏఈ శ్రీనివాసరావులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం పట్టణ పరిధి మళ్లవీధి, వేల్పులవీధి, శేఖవీధి, నర్సింగరావుపేట, ఉడ్‌పేట, పాత బర్మా కాలనీ, చవితినవీధి ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్‌ను సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

దేమునిగుమ్మం వేంకటేశుని హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

అనకాపల్లిటౌన్: స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.లక్షా 70 వేల 979లు వచ్చినట్లు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీధర్, ఈవో కీర్తి ఆదినారాయణ వెల్లడించారు. అక్టోబర్ 3 నుంచి నవంబర్ 6 వరకూ 33 రోజుల హుండీ ఆదాయం సోమవారం లెక్కించినట్లు తెలిపారు. హుండీ లెక్కింపులో నగదుతోపాటు, ఐదు గ్రాములు బంగారు ఉంగరం వచ్చిందన్నారు. ఆలయ చైర్మన్ సకలా రాజ్యలక్ష్మీ గోవిందరావు, అర్చకులు పులఖండం గిరిబాబు, ధర్మకర్తలు సుంకర వెంకటేశ్వరరావు, రాజాన లక్ష్మీ శ్రీనివాస్, సూరిశెట్టి సన్యాసిరావు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నియంత్రించాలి

పరవాడ: పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. తానాంలో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. గనిశెట్టి మాట్లాడుతూ కాలుష్యాన్ని నియంత్రించి ప్రజల ప్రాణాలను, చెరువుల్ని, పర్యావరణాన్ని కాపాడేందుకు తగు చర్యలు చేపట్టాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు
సోమవారం 4,299 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,850	4,500
రెండో రకం	3,400	4,060
మూడోరకం	3,200	3,950

అనకాపల్లి సినిమాలు

టైగర్ నాగేశ్వరరావు	రాజా
లియో	సత్యనారాయణస్క్రీన్-1
మ్యాడ్	సత్యనారాయణస్క్రీన్-2
భగవంత్ కేసరి	షిర్డిసాయి
కీడా కోలా	పర్తిసాయి
---	వెంకటేశ్వర
ఘోస్ట్	శ్రీసత్య
మా ఊరి పొలిమేర-2	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–9 యూనిట్లు, ఏ నెగిటివ్–1 యూనిట్, బీ పాజిటివ్–2 యూనిట్లు, బీ నెగిటివ్–1 యూనిట్, ఓ పాజిటివ్–16 యూనిట్లు, ఏబీ పాజిటివ్–4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 428 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 396 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

వర్షాభావం.. తెగుళ్ల బెడద

- మండలంలో వరి రైతుల్లో ఆందోళన
- ఇప్పటికే 12 ఎకరాల్లో ఎండిన పంట
- అక్టోబర్ మాసంలో అతి తక్కువ వర్షపాతం



బయ్యవరం వద్ద నీరు లేక బీడువారిన వరి పొలం



బుచ్చియ్యపేటలో ఎండిపోయిన వరి చేనును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి, దిగాలుగా రైతు

కశింకోట: మండలంలో వర్షాభావంతో ఖరీఫ్ వరి చేలు ఎండిపోతున్నాయి. ఇప్పటికే 12 ఎకరాలకు పైగా పంట ఎండిపోయింది. సుమారు 200 ఎకరాల్లో పంట ఎండిపోయే స్థితికి చేరువవుతోంది. ఇక వర్షాలు కురవకపోతే పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉంది. దీంతో మిగిలిన పంటకు కూడా నష్టం వాటిల్లుతుందేమోనన్న ఆందోళనలో రైతులు సతమతమవుతున్నారు.

వరి సాగుకు వరుణుడే ఆధారం

మండలంలో వరి పంటను ఎక్కువగా వర్షాధారంగా సాగు చేస్తున్నారు. గడచిన నాలుగేళ్లలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో సాధారణ విస్తీర్ణాన్ని మించి వరి పంట సాగు జరిగింది. ఈ ఏడాది మాత్రం వాతావరణం అనుకూలించక, సకాలంలో వర్షాలు కురవకపోవడంతో సాధారణ విస్తీర్ణం కంటే తక్కువగా వరి పంట సాగులో ఉంది. అడపాదడపా కురిసిన వర్షాలు, బోర్ల నీరు, శారదానది నీటితో ఏదో విధంగా ఇబ్బందులు పడి వరి నాట్లు వేశారు. సరైన వర్షాల్లేక నారు మడులు ఎండిపోయి, కొందరు పంట వేయడం మానుకున్నారు. దీంతో సాధారణ విస్తీర్ణానికి కూడా నాట్లు పడలేదు. ఈ ఏడాది 892 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణంగా అధికారులు నిర్ణయించగా, 847 హెక్టార్ల మేర వరి నాట్లు వేశారు. మరో 45 హెక్టార్లలో నాట్లు పడలేదు. గత ఏడాది సాధారణ విస్తీర్ణాన్ని మించి అదనంగా 200 హెక్టార్లలో నాట్లు వేశారు. చెరకు రైతులు కూడా వరి సాగు వైపు మళ్లారు.

అక్టోబర్లో అతి తక్కువ వర్షపాతం

దాదాపు నెలన్నరగా సరైన వర్షాలు లేవు. అక్టోబర్ నెలలో కేవలం 17 మి.మీ. అతి తక్కువ వర్షపాతం నమోదైంది. పరవాడపాలెం, ఉగ్గినపాలెం, బుచ్చియ్యపేట, నూతలగుంటపాలెం ప్రాంతాల్లో 12 ఎకరాలకు పైగా పంట ఎండిపోయింది. కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, తాళ్లపాలెం, జమాదులపాలెం, ఏనుగుతుని, జెట్టపురెడ్డితుని, నరసింగబిల్లి, చింతలపాలెం, జి.భీమవరం, అడ్డాం, కన్నూరుపాలెం, తీడ, చెరకాం, అచ్చెర్ల, కొత్తపల్లి, తేగాడ, పేరంటాలపాలెం తదితర 16 గ్రామాల్లో ఆశించిన మేర నీరు లేక సుమారు 200 ఎకరాల్లో పంట ఎండిపోయే స్థితికి చేరువవుతోంది. దీంతో వర్షాల కోసం రైతులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. బోర్లు, నీటి సదుపాయం ఉన్న చోట మాత్రం కాస్త పొలాలు బాగున్నాయి. వాటికి కూడా కాండంలో వర్షం కురవకపోతే ఆశించిన దిగుబడి రాదని, తెగుళ్లు ఆశించి తగ్గుముఖం పట్టవని రైతులు చెప్తున్నారు.



ఆకు ముడత ఆశించిన వరి



సుడి దోమ ఆశించి ఎండిపోతున్న వరి

పంటలకు తెగుళ్ల బెడద

మరోవైపు వర్షాలు లేక వరి పంటను తెగుళ్లు ఆశించి నష్టం కలిగిస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆకు ముడత తెగులు చాలా చోట్ల వరి చేలను ఆశించింది. దీనివల్ల ఆకులు ముడత పడి ఎదుగుదల లేక పంటలకు నష్టం ఏర్పడుతోంది. కొన్ని చోట్ల పొడ తెగులు, సుడిదోమ కూడా పీడిస్తున్నాయి. ఇంకొన్ని చోట్ల పొటాష్ లోపంతో ఆకుల చివర ఎరుపు రంగు చారలు ఏర్పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఒకవైపు వర్షాభావం, మరో వైపు తెగుళ్లతో పంటకు మరింత నష్టం కలుగుతుందని ఆవేదన చెందుతున్నారు.

కష్టపడ్డా ఫలితం లేదు



వర్షాధారంతో కౌలుకు సాగు చేస్తూ వేలాది రూపాయల పెట్టుబడి పెట్టాం. అష్టకష్టాలు పడి ఈ ఏడాది ఖరీఫ్ వరి నాట్లు వేశాం. నాట్లు వేసిన తర్వాత నుంచి సరైన వర్షాలు లేవు. గత నెలలో అయితే మరీ దారుణం. పూర్తిగా వర్షం కురవలేదు. దీంతో నాట్లు ఎండిపోయి నష్టపోతున్నాం.

– గెంజి చిలుకునాయుడు, కౌలు రైతు, నూతలగుంటపాలెం

వర్షాల్లేకుంటే ఇదే దుస్థితి



మూడెకరాలకు పైగా వరి పంట వేశాం. సరైన వర్షాల్లేక బయ్యవరం పెద్ద చెరువులోకి నీరు చేరలేదు. దాని నుంచి సాగు నీరు ప్రవహించక, వర్షాల్లేక నీటి కొరతతో పంట ఎండిపోతోంది. దీనివల్ల దిగుబడి తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి. వర్షాభావం ఏర్పడిన ప్రతీసారి ఇదే దుస్థితి.

– గొల్లవిల్లి వెంకటేశ్వరరావు, రైతు, బయ్యవరం

సస్య రక్షణ చర్యలు తప్పనిసరి

మండలంలో వర్షాభావం వల్ల 12 ఎకరాల మేర పంట ఎండిపోయింది. మరో 190 ఎకరాల్లో ఎండిపోయే స్థితిలో ఉంది. ఈ మేరకు ప్రభుత్వానికి ఇటీవల నివేదించాం. వర్షాలు పడితే ఎండిపోవడానికి సిద్ధంగా ఉన్న పంట కోలుకునే అవకాశం ఉంది. తెగుళ్లకు వర్షాభావం కూడా ఓ కారణం. ఆకుముడత నివారణకు లీటర్ నీటిలో కార్టాప్‌హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు కలిపి పంటపై పిచికారి చేయాలి. పొడ తెగులు ఆశించిన మేరకు హెక్సాకొనజోల్/వాలిడామైసిన్ తగు మోతాదులో పిచికారి చేయాలి. సుడిదోమ, పొటాష్ లోపం నియంత్రణకు సస్యరక్షణ చర్యలు తప్పనిసరి. – ఎం. స్వప్న, మండల వ్యవసాయాధికారి, కశింకోట

అందరి కృషితో తెలుగు భాష మనుగడ



తెలుగుకు వెలుగునిద్దాం కార్యక్రమంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

తుమ్మపాల: తెలుగు భాష పరిరక్షణకు అందరూ కృషి చేయాలని తెలుగు భాష పరిరక్షణ సమితి సమన్వయకర్త కె.రామ్మోహన్‌రావు తెలిపారు. స్థానిక గవరపాలెం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సోమవారం సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగుకు వెలుగునిద్దాం 40వ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అత్యధిక సంఖ్యలో విద్యార్థులుండే కార్పొరేట్ విద్యాసంస్థలు తెలుగు భాషపై అవగాహన కల్పించేందుకు తమకు అవకాశాన్ని ఇవ్వాలని కోరారు. పిల్లలకు తెలుగు భాష పట్ల ఆసక్తి కలిగించడానికి, అనకాపల్లితోపాటు చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో పర్యటించి విద్యార్థులను చైతన్యవంతుల్ని చేయడానికి సమితి విశేష కృషి చేస్తోందన్నారు. ప్రముఖ కవి, రచయిత రంగబాబు పిల్లలకు పరిచయమైన పద్యాలను ఉదహరిస్తూ, చిన్న చిన్న మాటలతో పద్యాలు, కవితలను విశదీకరించారు. కవయిత్రి కర్రి మల్లీశ్వరి మాట్లాడుతూ తేనెల తీయని మాటలతో అనే తెలుగు గీతాన్ని శ్రావ్యంగా ఆలపించి, తెలుగు భాష మాధుర్యాన్ని వివరించారు. ప్రముఖ రచయిత, కవి మాధవీ సనారా మాట్లాడుతూ తెలుగు పదాలలో అనేక ప్రయోగాలు చేయవచ్చునని, తగిన ఉదాహరణలలో చెప్పి, పిల్లల్లో ఆసక్తి కలిగించారు. ప్రముఖ రచయిత్రి అమరజ్యోతి మాట్లాడుతూ పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను పదును పెట్టాలన్నారు. సభలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఎం.రాము, తెలుగు ఉపాధ్యాయులు శివరామకృష్ణ, అచ్చన్నాయుడు, ఇతర ఉపాధ్యాయులు బాపన్న, పూర్ణిమ పాల్గొన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

పార్టీ శ్రేణులతో మంత్రి అమర్‌నాథ్



తేగాడలో బస్సు యాత్రపై చర్చిస్తున్న మంత్రి అమర్‌నాథ్

కశింకోట: అనకాపల్లిలో భారీ స్థాయిలో జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. మండలంలోని తేగాడ గ్రామం వద్ద ఎస్ఆర్ గార్డెన్‌లో మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులతో సోమవారం సమావేశమయ్యారు. గ్రామాల వారీగా సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతానికి అనుసరించాల్సిన విధి విధానాలపై చర్చించి, దిశా నిర్దేశం చేశారు. గ్రామాల వారీగా ఎంత మంది బస్సు యాత్రకు రానున్నారనే విషయమై శ్రేణులు మంత్రికి వివరించారు. మండలంలోని గ్రామాల నుంచి పది వేల మంది వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బస్సు యాత్రకు ఎక్కువ మంది ప్రజలు, పార్టీ శ్రేణులు, అభిమానులు, మహిళలు హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ సంస్థ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, మాజీ ఎంపీపీ మలసాల ధనమ్మ, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కమిటీల అధ్యక్షులు పాల్గొన్నారు.

9న తొలిదశ బస్సు యాత్ర ముగింపు సభ



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు

అనకాపల్లిటౌన్: సామాజిక సాధికార బస్సుయాత్ర తొలిదశ ముగింపు కార్యక్రమం స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఈ నెల 9న నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం పార్టీ నాయకులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించిన బస్సు యాత్ర గత నెల 26న ఇచ్ఛాపురంలో ప్రారంభమై ఈ నెల 9న స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానానికి చేరుకుంటుందన్నారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలకు అమలు చేసిన పలు సంక్షేమ పథకాల లబ్ధిని సభలో వివరించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోను 98 శాతం అమలు చేసిన ఘనత ప్రభుత్వానికే దక్కిందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత తమ అందరిపైనా ఉందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొడ్డేడ శివ, దేవస్థానాల చైర్మన్లు కొణతాల మురళీకృష్ణ, ఆళ్ల నాగేశ్వరరావు, కె.ఎం.నాయుడు, నుదురుపాటి తాతాజీ, పార్టీ రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహరావు, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ నాయకులు పలకా సత్యనారాయణ, కోరుకొండ రాఘవ, ఉగ్గిన అప్పారావు, గైపూర్ రాజు, వేగి త్రినాథ్, లట్టాల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'మాదిగ మహాసభకు తరలిరండి'



చలో హైదరాబాద్ పోస్టర్లను విడుదల చేస్తున్న మంగరాజు, మాదిగ నాయకులు

తుమ్మపాల: హైదరాబాద్‌లో ఈ నెల 11న జరగనున్న మాదిగల విశ్వరూప మహాసభకు రాష్ట్రంలోని మాదిగ, రెల్లి ఉపకులాలకు చెందిన ప్రజలు తరలిరావాలని జిల్లా మహాజన సోషలిస్టు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టుమూరి మంగరాజు మాదిగ సోమవారం పిలుపునిచ్చారు. పట్టణంలోని భీమునిగుమ్మం అరుంధతి సేవా సంఘం ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు యల్లబిల్లి కనకారావు ఆధ్వర్యంలో జరిగిన సన్నాహక సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ మాదిగల విశ్వరూప మహాసభకు ముఖ్య అతిథిగా వస్తున్నందున ఈ సభకు ఎంతో ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. ఈ సందర్భంగా చలో హైదరాబాద్ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో యువత, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, మహిళలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కొల్లి చినఅప్పారావు, చెవ్వేటి కమల జగదీష్ చంటి, చెవ్వేటి అప్పారావు, అనంతరపు రాజు, గొటివాడ రవికుమార్, లక్కిడపు పెంటారావు, దిగుమర్తి హిట్లర్, యాళ్లబిల్లి చిన్న, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన



జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన గురుకుల విద్యార్థులతో ఉపాధ్యాయులు

పరవాడ: కోల్‌కతా వేదికగా డిసెంబర్‌లో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు తానాం గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ఎన్టీపీసీ యోగా శిక్షణ కోచ్ సీహెచ్.ఆంజనేయులు చెప్పారు. ఈ నెల 1, 2, 3 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం వీరవాసరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ చూపిన ఎం.తేజస్విని, కె.హరిత, కె.ధనలక్ష్మి జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారని వెల్లడించారు. ఈ మేరకు పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ పద్మ, లలిత తదితరులు విద్యార్థులను అభినందించారు. జాతీయ పోటీల్లో కూడా గెలుపొందాలని అభిలషించారు.

అందరికీ రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష

- ఆరోగ్య సురక్ష శిబిరాలకు పోటెత్తిన జనం
- 389 మంది రోగులకు వైద్య సేవలు



రోగికి ఓపీ రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందిస్తున్న వైద్య సిబ్బంది



వైద్య శిబిరంలో రోగులతో మాట్లాడుతున్న వైద్యులు



వైద్య శిబిరంలో జెడ్సీ వెంకటరమణ పరిశీలన

అనకాపల్లిటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్యసేవలు అందించడమే కాకుండా, ఏ చిన్న సమస్య ఉన్నా, రోగిని దగ్గర్లోని ప్రభుత్వ పెద్దాస్పత్రి లేదా కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందిస్తున్నారు. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గ్రామ, పట్టణ ప్రాంతాల్లో ఇంత గొప్పగా వైద్య సేవలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. దేశంలో తొలిసారిగా పేదప్రజల వద్దకు వైద్యుడు వెళ్లి, వైద్యసేవలందించేలా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంతో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరానికి విశేష స్పందన లభిస్తోందని జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ సుర వెంకటరమణ అన్నారు. జీవీఎంసీ విలీనగ్రామం కొప్పాక హైస్కూల్(24వ సచివాలయం పరిధి) ఆవరణలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్ పరిధిలో 27 సచివాలయాల్లో సురక్ష వైద్యశిబిరాలు ముగిశాయన్నారు. శిబిరాలకు పెద్ద ఎత్తున రోగులు వచ్చి వారివారి సమస్యలను వైద్యులకు విన్నవించి, చికిత్స పొందినట్లు తెలిపారు.

సచివాలయం పరిధిలో 10 రోజుల క్రితం ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వలంటీర్లు ఇంటింటి సర్వేలో ప్రజలకు రక్తపరీక్షలు, బీపీలు చెక్‌చేసి అవసరమైన రోగులకు టోకెన్లు అందించి, సురక్ష వైద్య శిబిరానికి తీసుకు వచ్చినట్లు పేర్కొన్నారు. శిబిరంలో నలుగురు స్పెషలిస్టులు రోగులకు వైద్యసేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రజలతో పాటు స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి కూడా శిబిరంలో వైద్య సేవలు అందించారు. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న రోగులకు కంటివైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు, శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. అక్కడి పదార్థాలను, వాటి ప్రయోజనాలను ఆరా తీశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 279 మంది ఓపీ సేవలు పొందగా, ముగ్గురు రోగులను స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. నేత్ర పరీక్షలకు 110 మంది రోగులు హాజరుకాగా, 20 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. వారికి ప్రభుత్వమే శస్త్రచికిత్సలు నిర్వహిస్తుందని భరోసానిచ్చారు. 62 మందికి కళ్ల అద్దాలు అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిమేర బాలాజీ, సచివాలయం కన్వీనర్లు చింతల రాము, నట్టిమి రామచంద్ర, స్పెషలిస్టు వైద్యులు, సచివాలయం ఉద్యోగులు, ఆశ వర్కర్స్, సచివాలయం ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.

'అనకాపల్లి వరకు సిటీ బస్ పాసులు అనుమతించాలి'



డీపీఎంవో పద్మావతికి వినతిపత్రం అందిస్తున్న దాడి రత్నాకర్

తుమ్మపాల: ఆర్టీసీలో నడుపుతున్న అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులకు పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో హాల్ట్ ఏర్పాటు చేయడంతో పాటు, సిటీ బస్ పాస్‌లను విశాఖపట్నం నుంచి అనకాపల్లి వరకు వర్తింపజేయాలని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. ఈ మేరకు ఆయన ఆర్టీసీ డీపీఎంవో పద్మావతికి సోమవారం వినతిపత్రం అందించారు. కాంప్లెక్స్‌లో కనీస వసతులు తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేదన్నారు. కాంప్లెక్సు ఆవరణలో ప్రయాణికులు వేచి ఉండే ఫ్లాట్‌ఫారం శ్లాబ్ పెచ్చులూడుతూ ప్రయాణికులకు అపాయంగా మారుతోందన్నారు. ఫ్లాట్‌ఫారం వద్ద ఏర్పాటు చేసిన టీవీలు పనిచేయకపోవడంతో, ఏ బస్సు ఎప్పుడు వస్తుందో ప్రయాణికులకు తెలియట్లేదన్నారు. వీటన్నింటినీ వినతి పత్రంలో పేర్కొని, త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

గొర్రెలు, మేకల సంతకు తగ్గిన గిరాకీ



ఆశించిన ధర రాక వ్యాన్‌లో వెనక్కి తీసుకెళ్తున్న గొర్రెలు, మేకలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం గొర్రెలు, మేకల అమ్మకాలు ఆశించిన స్థాయిలో జరగలేదు. దసరా అయిపోవడంతో సంతకు గిరాకీ తగ్గింది. అరకొరగా అమ్మకాలు జరిగినా, ఆశించిన ధర రాలేదు. దీంతో కొందరు తమ జీవాలను తిరిగి తీసుకుపోయారు. ఉమ్మడి విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల నుంచి సుమారు వెయ్యి వరకు గొర్రెలు, మేకల, మందలు, పెంచినవి సంతకు అమ్మకానికి వచ్చాయి. ఒక్కొక్కటి పరిమాణాన్ని అనుసరించి రూ.5 వేల నుంచి రూ. 25 వేల వరకు అమ్మకాలు సాగాయి. విశాఖ, గాజువాక, అనకాపల్లి, యలమంచిలి తదితర సుదూర ప్రాంతాలతోపాటు స్థానికులు కొనుగోలు చేసి వ్యాన్లు, ఆటోల్లో తీసుకెళ్లారు. అయితే పెంపకందారులు, వ్యాపారులు కొంత మంది తమకు ఆశించిన ధర లభించకపోవడంతో, నిరాశగా వెనక్కి తీసుకుపోయారు. సంక్రాంతి రోజుల వరకు ధరలు తక్కువగానే ఉంటాయని వ్యాపారులు చెప్తున్నారు.

నాగుల చవితి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



నాగుల చవితి ఉత్సవాల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న దాడి రత్నాకర్

తుమ్మపాల: ఈ నెల 12 నుంచి 17 వరకు గవరపాలెం దిబ్బవీధి శ్రీ నాగేంద్రస్వామి దేవస్థానంలో నాగులచవితి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. ఈ మేరకు ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి సోమవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పీఎస్‌కే నాయుడు, బొడ్డేడ లోచన్, కొణతాల త్రినాథ్, మళ్ల జగదీష్, పీలా గిరి తదితరులు పాల్గొన్నారు.

26న ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న హెచ్ఎం ఎంఆర్‌వీ అప్పారావు

కశింకోట: జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో జాతీయ ప్రతిభ ఉపకార వేతనం (ఎన్ఎంఎంఎస్) నమూనా పరీక్షను ఈ నెల 26న నిర్వహించనున్నట్లు స్పందించే హృదయం సంస్థ ఉపాధ్యక్షుడు ఆచంట నాగేశ్వరరావు తెలిపారు. కశింకోటలోని డీపీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నమూనా పరీక్ష నిర్వహణపై రూపొందించిన కరపత్రాలను హెచ్ఎం ఎంఆర్‌వీ అప్పారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసే 8వ తరగతి విద్యార్థుల అవగాహన కోసం కశింకోట, మునగపాక, నర్సీపట్నం, వడ్డాది హైస్కూళ్లలో నమూనా పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు తమ పేర్లను ఈ నెల 22లోగా నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు ఏవీఎన్ మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.